క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిన టీఎన్‌ఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు



పార్టీ కండువా కప్పుతున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కోవ లక్ష్మి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుమారు వంద మంది పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో శ్యాం, శ్రీకాంత్, పవన్, మహేష్, రాజ్‌కుమార్, యువత ఉన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన యువకులతో హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన పలువురు యువకులు మాజీ కౌన్సిలర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో ఆనాడు పాల్వాయి పురుషోత్తం రావు చేసిన అభివృద్ధి తప్పా ఈ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి యూనియన్ నాయకులు జెండా ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో శ్రామిక, కార్మిక వర్గానికి ఏఐటీయూసీ అండగా నిలిచిందన్నారు. పారిశ్రామిక రాజధాని ముంబైలో 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, కొమురక్క, సురేశ్, మోహన్, తిరుపతి, బావుజీ, తుకారాం, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, కిషన్, సుధాకర్, అంజి, సురేశ్, రాజు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దహెగాం: మండలంలోని కల్వాడ గ్రామ శివారులో మంగళవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. గ్రామ శివారులో నాటు సారాకు ఉపయోగించే 3 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని పేర్కొన్నారు. నాటు సారా అమ్మినా, తయారు చేసినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఆర్.కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం

వాంకిడి: మండలంలోని చిన్న పుల్లార గ్రామానికి చెందిన గర్భిణీ కె.వైశాలి 108 వాహనంలో మగ శిశువుకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ పవర్ రాజా, పైలట్ వి.విలాస్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం వైశాలిని వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించే క్రమంలో మార్గమధ్యలో పురిటినొప్పులు రాగా మంచిర్యాల సమీపంలో వాహనంలోనే ప్రసవం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తల్లీ, బిడ్డను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలి

కౌటాల: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో సోమయ్య అన్నారు. మంగళవారం కౌటాల రైతు వేదిక భవనంలో కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని హెచ్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎంలు జయరాజ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం లేక ఇక్కట్లు..!

- సరఫరా లేక నిలిచిన పెట్రోల్, డీజిల్ అమ్మకాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మూసి ఉన్న పెట్రోల్ బంక్

తిర్యాణి: మండలంలోని వాహనదారులు పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెట్రోల్ బంక్‌లో నిల్వలు లేక దాదాపు 30 కిలోమీటర్ల దూరం లో ఉన్న బంక్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో..

గిరిజన ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేందుకు మూడేళ్ల క్రితం జీసీసీ (గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్) సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. మండలంలోని ఏకైక పెట్రోల్ బంక్ కావడంతో గడిచిన ఏడాది వరకు బంక్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లింది. అయితే గత ఏడాది నుంచి పన్నుల భారం పెరగడంతో నిర్వహణ కష్టాలు మొదలయ్యాయి.

నిలిచిన అమ్మకాలు..

మండలంలో 29 గ్రామపంచాయతీల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు మొత్తంగా దాదాపు మూడువేలకు పైగా వాహనాలు ఉన్నాయి. అయితే మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా పెట్రోల్ నిల్వలు లేకపోవడంతో పెట్రోల్, డీజిల్ కోసం దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐబీ తాండూర్, ఆసిఫాబాద్‌లోని పెట్రోల్ బంక్‌కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అన్ని గ్రామపంచాయతీలల్లోనూ లూజ్ పెట్రోల్ అమ్మకాలు జరుపుతున్నా వాటి ధరలు అధికంగా ఉండటం, నాణ్యతపై అనుమానాలు ఉండటంతో పెట్రోల్ పోసుకునేందుకు వాహనదారులు జంకుతున్నారు.

వ్యాట్ అధికం..

గతంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై వ్యాట్ కేవలం ఒక్క శాతం మాత్రమే ఉండగా గత ఏడాది వ్యాట్ 5 శాతానికి పెరగడంతో అమ్మకం ధరల కన్నా కొనుగోలు చేస్తున్న రేటు అధికమైంది. దీంతో పెట్రోల్, డీజిల్ రవాణాను బంక్ నిర్వాహకులు తాత్కాలికంగా నిలిపివేశారు.

మస్తు కష్టమవుతుంది



పెట్రోల్ బంక్‌కు ఎప్పుడు వెళ్లినా పెట్రోల్ లేదు అనే సమాధానం విన్పిస్తుంది. దగ్గరలో బంక్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత్యంతరం లేక బ్లాక్‌లో కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నాం.

– కోట్నాక గణపతి, కౌటగాం

బంక్ తెరిపించాలి



పెట్రోల్ బంక్ మూతపడడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు బంక్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి బంక్ యధావిధిగా నడిచేలా చర్యలు చేపట్టాలి. జీసీసీ అధికారులు బంక్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

– పులి వెంకటేశ్, తిర్యాణి

పది రోజుల్లో ప్రారంభిస్తాం

పెట్రోల్ ఉత్పత్తులపై విధించిన వ్యాట్ కారణంగా బంక్ మూసి వేశాం. అయితే ప్రభుత్వ బంక్‌లకు వ్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది. జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న బంక్‌లకు మినహాయింపు వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. పది రోజుల్లో యధావిధిగా పెట్రోల్ బంక్ నడిపిస్తాం.

– పాపారావు, జీసీసీ బంక్ ఇన్‌చార్జి

గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



పెంచికల్‌పేట్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



దహెగాం: ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ

దహెగాం: గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని కమ్మర్‌పల్లి, ఒడ్డుగూడ, కల్వాడ గ్రామాల్లో కోనేరు ట్రస్టు అధ్యక్షుడు కోనేరు వంశీ, జెడ్పీటీసీ శ్రీరామోజు రామారావులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కోనప్పను గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ముందుగా ఒడ్డుగూడ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మండల రైతు బంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, నాయకులు భీమన్న, క్రిష్ణ, నాగేశ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు మద్దతుగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను గ్రామస్తులకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, సర్పంచులు దేవాజీ, శ్రీనివాస్, సంజీవ్, చంద్రమౌళి, సుధాకర్, రాజన్న, ఎంపీటీసీ రాజన్న, నాయకులు చౌదరి శ్రీనివాస్, సముద్రాల రాజన్న, ఎస్‌కే బాబు, బాపు, బండన్న, సయ్యద్ సాజీద్ పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: బీఆర్‌ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంపేట్, శివాలింగపూర్, గురుడుపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచులు శ్రీనివాస్, రమేశ్, మౌనిశ్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు మెర్వల్లి బ్రహ్మయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, రాంచందర్, అశోక్, సత్తయ్య, పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

తిర్యాణి: ఇందిరాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరా గాంధీ 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా ఆమె చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరా గాంధీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకన్న, నర్సయ్య, వెద్మ శంకర్, మేడిశెట్టి శంకర్ తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని మహిళ ఆవేదన



మాట్లాడుతున్న సంధ్య

ఆసిఫాబాద్‌అర్బన్: తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని తిర్యాణి మండలంలోని గిన్నెదరి గ్రామానికి చెందిన మహిళ విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన సంధ్య మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి విజయరావ్ 25, ఆగస్టు 2022న మరణించగా, ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాట్యూటీ, ఇతర బెన్‌ఫిట్స్ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న డబ్బులు గంటలో వచ్చే విధంగా చేస్తానని ఎమ్మెల్యే ఆత్రం సక్కు దగ్గర పీఏగా పని చేసిన సంపత్ నమ్మించారని పేర్కొన్నారు. ఇందు కోసం డబ్బులు డిమాండ్ చేయగా రూ.2,05,000 అతనికి ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. డబ్బులు తీసుకొని 2 నెలలు గడిచినా తమకు రావాల్సిన డబ్బులు రాలేదని, అడిగితే సదరు వ్యక్తి బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా తమ డబ్బులు వచ్చే విధంగా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ధర్నా



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కాగజ్‌నగర్‌టౌన్: దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ కాలనీవాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. వాహనాల శబ్దాలతో రాత్రి పూట ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. అరుణోదయ పాఠశాల నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రహదారిపై ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. రైల్వేస్టేషన్, డెయిరీ ఫామ్‌కు వెళ్లే వాహనాలు, రైల్వే వాహనాలు, స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికుల వాహనాలతో ఎప్పుడు బిజీగా ఉండే రహదారికి కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుగుణ, అనసూర్య, జయ, కాంతమ్మ, షాహిన్, ఎ.శ్రీదేవి, సాజిద్, విజయ, నారాయణ, వెంకటేష్, యూసుఫ్, శశికాంత్, ఫసీయొద్దీన్, వకీల్, రాందాస్, అంజన్న, దామోదర్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

జైనూర్: రైతులు ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్షబీమా యోజన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ ఎఫ్ఎల్‌సీ లోక రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆశేపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యాక్స్ సిబ్బంది జనార్ధన్, సహకార సిబ్బంది కిరణ్, తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా భద్రావతిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో బిందుష, టింకిల్ రాయ్, సిద్ధు విలాసి, వినయ్, వినోద్, అశ్విత్, వివేక్, రహస్య, రేవంత్ పాల్గొని సత్తా చాటారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కరాటే మాస్టర్ ఎం.దేవయ్య, సీహెచ్ రమేశ్ అభినందించారు.

మార్కెట్ బంద్ పాటించాలి



జైనూర్‌లో మాట్లాడుతున్న సోనేరావు

జైనూర్: ఏటా నిర్వహించే ఆదివాసీ వీరుడు కుమురంభీం, గ్రామ పటేల్ వ్యవస్థాపకుడు కొడప సోనుపటేల్ వర్ధంతి రోజున మార్కెట్ బంద్ పాటించాలని కుమురం భీం మనమడు కుమురం సోనేరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కుమురం భీం, కొడప సోనుపటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్యదైవం కుమురంభీం, జైనూర్ గ్రామ వ్యవస్థాపకుడు కొడప సోనుపటేల్ వర్ధంతి రోజున వ్యాపార సంఘాలు మార్కెట్ బంద్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడప విశ్వంరావు, మాజీ ఎంపీపీ ధర్మారావు, సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, కోడప వామన్, తదితరులు ఉన్నారు.

వాంకిడిలో నగదు సీజ్

వాంకిడి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన యశ్ శుక్లా అనే వ్యక్తి కారులో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4,75,000 సీజ్ చేశారు. నగదును స్వాధీనం చేసుకొని ఎఫ్.ఎస్.టీ టీంకు అప్పగించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బీజేపీని ప్రజలు ఆదరించాలి



మాట్లాడుతున్న మనోహర్ గౌడ్

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరించాలని మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్ గౌడ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. మండల కేంద్రంలో మాట్లాడారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ సిర్పూర్ అభ్యర్థి పాల్వాయి హరీశ్ బాబు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నాయకులు జనార్దన్, దిగంబర్, పాల్వాయి సుధాకర్ రావు, రాజారామ్, సంతోష్, శ్యామ్‌సుందర్, శంకర్, మల్లయ్య, కృష్ణ, రామయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి అవకాశం ఇవ్వండి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అర్షద్ హుస్సేన్

దహెగాం: బీఎస్పీ పార్టీతోనే సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీఎస్పీలో చేరారు. సహకార సంఘం డైరెక్టర్ షాకీర్, దహెగాం ఉపసర్పంచ్ ఎల్కరి ప్రశాంత్, వార్డు సభ్యులు నస్పూరి లక్ష్మి, నల్లి అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్కరి సంతోష్, మేకల మల్లేష్, రాజేశ్వరీ లతోపాటు సుమారు 50 మంది పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు దుర్గం దేవిదాస్ నాయకులు పాల్గొన్నారు.

‘సంక్షేమమే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తుంది’



ఆర్‌ఆర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ



కెరమెరి: పోస్టర్ అతికిస్తున్న నాయకులు

కెరమెరి: పదేళ్లుగా చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమమే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తుందని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ పోస్టర్లను అతికించారు. కారు గుర్తుకు ఓటేసి కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొహర్లే శంకర్, పెందోర్ జలపతిరావు, మడావి రఘునాథ్, సెండే నారాయణ, రాజయ్య, వెంకటేశ్, జాహెద్, శ్రీనివాస్, పూసం భీంరావు, పెంటూ తదితరులు ఉన్నారు.

ప్రచారంలో ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండలంలో అడ్డఘాట్ ఆర్ఆర్ కాలనీలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. నాయకులు కిష్టయ్య, మల్లేష్, రమేశ్, తిరుపతి ఉన్నారు.

ప్రధాన్ సంఘం ఏకగ్రీవ తీర్మానం

జైనూర్: ప్రధాన్ సమాజమంతా ఏకగ్రీవంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తీర్మానించినట్లు ప్రధాన్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని జామిని గ్రామంలో ప్రధాన్ సేవా సంఘం రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బీఆర్‌ఎస్ పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రధాన్ సమాజ్ పెద్దలు, సర్పంచి రాహుల్, కృష్ణ ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని డిమాండ్



డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపై నిలిచిన మురికి నీరు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని 9వ వార్డులో డ్రెయినేజీ నిర్మించాలని సీపీఎం కాగజ్‌నగర్ పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, సీపీఎం పట్టణ నాయకుడు చాపిలే సాయికృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీలో పర్యటించిన నాయకులు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపైకి వస్తుందన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రతిరోజూ విద్యార్థులను బడికి పంపాలి



సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు

కెరమెరి: ప్రతిరోజు విద్యార్థులను బడికి పంపించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండలంలోని 56 ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు బడుల కంటే నాణ్యమైన విద్య ప్రభుత్వ బడుల్లో లభిస్తుందన్నారు. ప్రతి నెలా నిర్వహించే పీటీఎం మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, రుక్సానా బేగం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న రావి శ్రీనివాస్

కౌటాల: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను ప్రవేశపెడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే పేద ప్రజల బతుకులు మారుతాయని తెలిపారు. అంతకు ముందు పలువురు యువకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సంతోష్, వెంకటేశ్, శంకర్, సత్తయ్య, శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, వసంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

‘బీఎస్పీ కార్యకర్తను అదుపులోకి తీసుకోవడం సరికాదు’

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన బుద్దె గురువయ్య పత్తి పంటను ధ్వంసం చేసిన ఘటనలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో బీఎస్పీ కార్యకర్త సాయిరె శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరికాదని బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ అన్నారు. దహెగాం పోలీసు స్టేషన్‌లో ఉన్న శంకర్‌ను మంగళవారం పరామర్శించారు. ఇటీవల శంకర్ బీఆర్‌ఎస్ నుంచి బీఎస్పీలో చేరడంతోనే అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. వెంటనే పోలీసులు విడిచిపెట్టకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాగా ఇదే విషయమై ఎస్సై సనత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా శంకర్‌తోపాటు అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నామని తెలిపారు.